

మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి

# ఉద్యోగులకు వరం సింగరేణి వైద్యం

## సీఎం కేసీఆర్ కృషితో నల్లసూర్యుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

- కోల్‌బెల్ట్ వ్యాప్తంగా మెరుగుపడ్డ దవాఖానలు
- దశాబ్దకాలంలో కార్పొరేట్‌కు దీటుగా సేవలు
- 126 సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌తో అనుబంధం..
- ఏటా వందలాది కోట్ల నిధులు
- గతేడాది రూ.6.25 కోట్లతో ఆధునిక పరికరాల కొనుగోలు
- రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక మెడికల్ ఇన్సూరెన్స్
- ఏసీతో పాటు లైఫ్ సపోర్టు సిస్టం కలిగిన 61 అంబులెన్స్‌లు అందుబాటులోకి

**ప్రత్యేక రాష్ట్రంలో సింగరేణి యాజమాన్యం..** ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో ఈ దశాబ్దకాలంలో కోల్‌బెల్ట్ వ్యాప్తంగా సింగరేణి దవాఖానలను ఆధునీకరించి, కార్పొరేట్‌కు దీటుగా మెరుగుపర్చింది. ఎప్పటికప్పుడు ఆధునిక పరికరాలు కొనుగోలు చేసి, పరీక్షలు నిర్వహిస్తూనే.. 126 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో అనుబంధంగా వైద్య సేవలు అందిస్తున్నది. అందుకు ఏటా వందల కోట్ల నిధులు ఖర్చుచేస్తున్నది. అలాగే ఎప్పటికప్పుడు స్పెషలిస్టుల నియామకం చేపడుతున్నది. రిటైర్డ్ ఉద్యోగులకు సైతం మెడికల్ ఇన్సూరెన్స్ కల్పిస్తుండగా, నల్లసూర్యుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

**- మందమర్రి, నవంబర్ 13**



దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికులు

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకుల పట్టింపు లేనితనంతో సింగరేణి దవాఖానలు దయనీయ స్థితిలో ఉండేవి. ఉద్యోగులు తప్పనిసరి పరిస్థితిలో వ్యయ ప్రయాసలకోర్చి ప్రైవేటు దవాఖానలకు వెళ్లేవారు. తెలంగాణ ఏర్పడిన తరువాత స్వపరిపాలనలో సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపడంతో సింగరేణి అభివృద్ధిని సాధించడంతో పాటు వైద్య సేవలను కూడా మెరుగుపర్చింది. అత్యాధునిక పరికరాలతో పాటు ప్రైవేటు, కార్పొరేట్‌కు దీటుగా దవాఖానలను తీర్చిదిద్దింది. సీఎం ఆదేశాలతో సీఎండీ శ్రీధర్.. ఉత్పత్తితో పాటు ఖర్చుకు వెనుకాడకుండా వైద్యం, వైద్య విభాగం అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

### ఆధునిక పరికరాలు.. కోట్ల నిధులు..

సింగరేణి దవాఖానల్లో వార్డులను ఆధునీకరించి ఏసీ వార్డులుగా మార్చారు. గతేడాది కార్మికుల వైద్యం కోసం యాజమాన్యం రూ.259 కోట్లు వెచ్చింది. సుమారు ఆరున్నర కోట్లతో సింగరేణి వ్యాప్తంగా ఏడు ఏరియాల దవాఖానలకు కావాల్సిన ఆధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేశారు. ప్రధానంగా 2డీ ఈకో పరికరాలు, సీటి స్కాన్, కంటి పరీక్షల నిర్వహణకు గ్రీన్ లేజర్, యాగ్, నేచర్ ఫండస్ కెమెరాలు, డిజిటల్ ఎక్స్‌రే యూనిట్లు, షుగర్ పరీక్షలను వేగంగా జరిపేందుకు హెచ్.బీ.ఏ 1సీ యంత్ర విభాగాలను కొనుగోలు చేశారు. కొత్తగూడెం, రామగుండం, రామకృష్ణాపూర్, భూపాలపల్లి ఏరియా దవాఖానల్లో ఫిజియో థెరపీ విభాగాలను ఏర్పాటు చేసి, అత్యాధునిక లేజర్ థెరపి యూనిట్లు, కాంబినేషన్ థెరపి మల్టీ జిమ్‌లు, సీపీఎం మిషిన్లు, మజిల్ స్టిమ్యులేటర్లతో వైద్య సేవలందిస్తున్నారు.

### 126 సూపర్‌స్పెషాలిటీ దవాఖానలతో అనుబంధ..

సింగరేణి ఏరియా ఆసుపత్రులతో పాటు అత్యవసర సమయంలో మెరుగైన వైద్యం అందించేందుకు యాజమాన్యం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి నగరాల్లో 126 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో ఒప్పందం చేసుకున్నది. గని ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడే కార్మికులు.., వారి కుటుంబ సభ్యులు ఎవరైనా వ్యాధుల బారిన పడినప్పుడు హైదరాబాద్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు రెఫర్ చేసి, వైద్యం అందిస్తున్నారు. అందుకు సంబంధించిన బిల్లులను పూర్తిగా యాజమాన్యమే చెల్లిస్తున్నది. బాధితులను అత్యవసర పరిస్థితిలో దూర ప్రాంతంలోని ఆసుపత్రులకు తరలించేందుకు ఏసీతో పాటు లైఫ్ సపోర్టు సిస్టం కలిగిన 61 అంబులెన్స్‌లను యాజమాన్యం అందుబాటులోకి తెచ్చింది. ప్రత్యేక పాలనలో బొగ్గు ఉత్పత్తితో పాటు వైద్య సదుపాయాలు మెరుగుపడడంపై కార్మికులు, వారి కుటుంబాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఎప్పటికప్పుడు స్పెషలిస్టుల నియామకం.

ఎప్పటికప్పుడు స్పెషలిస్టు వైద్యులను నియమిస్తూ ఖాళీలను భర్తీ చేశారు. ఇప్పటి వరకు 85 మంది స్పెషలిస్టు వైద్యులు, 118 మంది జనరల్ డ్యూటీ వైద్యులు, 342 మంది స్టాఫ్ నర్సులు, అదనంగా కాంట్రాక్టు ప్రాతిపాదికన నలుగురు స్పెషలిస్టు వైద్యులు, 20 మంది జనరల్ డ్యూటీ డాక్టర్లు, 70 మంది స్టాఫ్ నర్సులను నియమించి, వైద్య సేవలందిస్తున్నారు.

### కరోనా సమయంలో విశేష సేవలు..

కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలో సింగరేణి వైద్య విభాగం విశేష వైద్య సేవలందించింది. అన్ని ఏరియా దవాఖానల్లో 1,578 బెడ్లతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. కార్మికులు, వారి కుటుంబాల ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన కొవిడ్ పరీక్షలు చేసి, వ్యాధి తీవ్రతను బట్టి ఐసొలేషన్ వార్డుల్లో చికిత్స అందించారు. ఆ వార్డుల్లో అప్పటికప్పుడు లక్షలాది రూపాయల వ్యయంతో అత్యాధునిక వెంటిలేటర్లు, సీపీఏపీ, బీఐపీఏపీ యంత్రాలను కొనుగోలు చేసి, వైద్యం అందించారు. సింగరేణి కార్మికులకే కాకుండా కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు కూడా వ్యాక్సినేషన్ చేశారు.

### టర్కీ నుంచి ఆక్సిజన్ ప్లాంట్లు..

కొవిడ్ సమయంలో ఎదుర్కొన్న ఆక్సిజన్ కొరతను అధిగమించేందుకు యాజమాన్యం టర్కీ నుంచి ఐదు ఆక్సిజన్ ప్లాంట్లను కొనుగోలు చేసింది. కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రితో పాటు రామగుండం, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, భూపాలపల్లి ఏరియా దవాఖానల్లో ఏర్పాటు చేశారు. వాటి నుంచి నేరుగా వార్డులకే పైప్‌లైన్ సాయంతో ఆక్సిజన్ సరఫరా ప్రారంభించింది. రామగుండం ఏరియా దవాఖానలో వార్డులతో పాటు సిలిండర్లలో ఆక్సిజన్‌ను నింపి సింగరేణిలోని ఇతర దవాఖానలకు సరఫరాను ప్రారంభించింది.

### ఉద్యానవనాలను తలపిస్తున్న దవాఖానలు..

ఏరియా దవాఖానలు ఉద్యానవనాలను తలపిస్తున్నాయి. సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న హరితహారంలో యాజమాన్యం కూడా పాల్గొంటున్నది. అందులో భాగంగా సింగరేణి పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలతో పాటు ఆసుపత్రుల ఆవరణలో కూడా విరివిగా మొక్కలు నాటారు. నాడు నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి ఆసుపత్రులకు వచ్చే బాధితులతో పాటు ప్రజలను సేదతీర్చుతున్నాయి. ఆవరణలో పూల పండ్ల మొక్కలు నాటడంతో ఉద్యానవనాలను తలపిస్తున్నాయి.




దవాఖాన ఆవరణలో ఏర్పాటు చేసిన ఆక్సీజన్ ఉత్పత్తి ప్లాంట్

### మెరుగైన వైద్యం అందుతున్నది..



తెలంగాణ ఏర్పడిన తరువాత సింగరేణి యాజమాన్యం వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దవాఖానల్లో గతంలో కంటే అన్ని సౌకర్యాలు కల్పించింది. దీంతో సింగరేణి దవాఖానల్లోనే ప్రైవేటు కంటే మెరుగైన వైద్యం లభిస్తున్నది. కొవిడ్ సమయంలో సింగరేణి అందించిన సేవలు అందించిన వైద్య సేవలు మరువలేనివి. సింగరేణిలో అన్ని వసతులతో వైద్యం లభించడం మా అదృష్టం.

**- మద్దెల శంకర్, మందమర్రి**

### అన్ని వసతులతో చికిత్స ..



సింగరేణి దవాఖానలు పూర్తిగా మారిపోయాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సార్ సింగరేణి అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో సింగరేణి దవాఖానకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికర పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడు అన్ని వసతులతో కూడిన వైద్య అందుతున్నది. సింగరేణి యాజమాన్యం కృషి మరువలేనిది.

**- సీపెల్లి రాజలింగు, సింగరేణి కార్మికుడు, మందమర్రి**

### కార్పొరేట్ స్థాయిలో..



సింగరేణి దవాఖానల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతున్నది. డిస్పెన్సరీలతో పాటు ఏరియా దవాఖానల్లో యాజమాన్యం అన్ని రకాల వసతులు కల్పిస్తున్నది. ఉమ్మడి పాలనలో సింగరేణి దవాఖానలు పేరుకే అన్నట్లు ఉండేవి. స్వపరిపాలనలో కార్పొరేట్‌స్థాయిలో ప్రైవేటుకు దీటైన సౌకర్యాలతో చికిత్స అందిస్తున్నారు. అందుకు కృషి చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

**- అందె శ్రీకాంత్, మందమర్రి**

### ఆహ్లాదకరమైన వాతావరణం..



సింగరేణి దవాఖానల్లో ఏపుగా పెరిగిన మొక్కలు, పండ్లు, పూల రకాల మొక్కలతో అహ్లాదకరమైన వాతావరణం ఉంది. అక్కడికి వెళ్లే వారికి ఆ వాతావరణ ఊరటనిస్తున్నది. ఏసీ వార్డులు, అన్ని వసతులతో వైద్యం అందించడంతో ఆసుపత్రులపై విశ్వాసం పెరిగింది. సింగరేణి ఉద్యోగులు తీవ్రమైన అనారోగ్యం బారిన పడినప్పుడు అన్ని వసతులతో కూడిన అంబులెన్స్‌ల్లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

**- బెల్లం అశోక్, మందమర్రి**

# శ్రీరాంపూర్‌లో పోలీసుల కవాతు



శ్రీరాంపూర్ కాలనీలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీరాంపూర్, నవంబర్ 13 : శ్రీరాంపూర్ కాలనీలో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ సర్కిల్ పరిధి శ్రీరాంపూర్, భీమారం, జైపూర్ పోలీసులు సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. జైపూర్ ఏసీపీ మోహన్ కవాతు ప్రారంభించి, పాల్గొన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్ శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ వద్ద మొదలై, శ్రీరాంపూర్ కాలనీ, ఆర్కే-6 గుడిసెలు, గాంధీనగర్, హిమ్మత్‌నగర్ ఆర్కే-6 కొత్తరోడ్ వరకు సాగింది. ప్రజలంతా నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీస్ బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్, భీమారం, జైపూర్ ఎస్‌ఐలు రాజేశ్, రాజవర్దన్, ఉపేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- కన్నెపల్లి మండలం సుర్జాపూర్ గ్రామంలో విషాదం

తాండూర్/కన్నెపల్లి, నవంబర్ 13 : తాండూర్ మండలం రేపల్లెవాడ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గందె సాయికృష్ణ (25) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎస్ రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లి మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన సాయికృష్ణ తన బైక్‌పై ఆసిఫాబాద్‌లోని తన అత్తగారింటికి వెళ్తున్నాడు. రేపల్లెవాడ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ అతివేగంతో అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని సాయికృష్ణ తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖాకు తరలించిట్లు పేర్కొన్నారు. కాగా, సుర్జాపూర్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పెళ్లి అయి ఏడాది గడవకముదే రోడ్డు ప్రమాదంలో సాయికృష్ణ మృతిచెందడం గ్రామస్తులను కలిచివేసింది. అందరితో కలివిడిగా ఉండే సాయికృష్ణ మృతితో స్నేహితులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.